తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎంగలి రఘు తల్లి సుశీల ఇటీవల మృతిచెందారు. నేడు ఆమె దశ దిన కర్మ కావడంతో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి రఘుతోపాటు ఆయన సోదరులు బాలకృష్ణ, యాదగిరి, శ్రీనివాస్, రమేశ్‌లను పరామర్శించారు. సుశీల మృతిపట్ల ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. - ఆమనగల్లు, డిసెంబర్ 28

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

అప్పారెడ్డిగూడలో ఉచిత వైద్యశిబిరంలో పాల్గొన్న మాజీ సర్పంచ్ పూజిత తదితరులు

షాబాద్, డిసెంబర్ 28 : గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అప్పారెడ్డిగూడ మాజీ సర్పంచ్ పోలేపల్లి పూజిత అన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ గ్రామంలో చేవెళ్లకు చెందిన పీఎంఆర్ మెడికల్ దవాఖాన ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో సుమారు 281 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఇందులో 46 మందిని ఆపరేషన్ల కోసం గుర్తించారు. వారిని సోమవారం చేవెళ్ల దవాఖానకు తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్‌లు చేయనున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాలు పేదలకు దేవుడిచ్చిన వరంలాంటి వని చెప్పారు. ప్రజలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పీఎంఆర్ దవాఖాన వైద్యులు ఉచిత వైద్యశిబిరాల ద్వారా పేదలకు వైద్యం అందించడం సంతోషకరమని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కుసుమ మాధురి సర్వే సిబ్బందికి సూచించారు. శనివారం మంగళపల్లి, చెన్నకేశవకాలనీల్లో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఆమె పరిశీలించారు. - ఆమనగల్లు, డిసెంబర్ 28

మంచాలలో ఉచిత కంటి వైద్య శిబిరం

ఉచిత కంటి వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎస్సై లాలయ్య

మంచాల, డిసెంబర్ 28 : మంచాల గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మంచాల ఎస్సై లాలయ్య ప్రారంభించారు. ఈ శిబిరంలో నగరానికి చెందిన కంటి వైద్యులు ఎంఎస్ రెడ్డి, భగవాన్ వంద మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను అందజేశారు. అందులో 25 మందికి కంటి ఆపరేషన్ అవసరమున్నట్లు వైద్యులు గుర్తించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో లయన్స్ క్లబ్ వారు ఉచిత కంటి పరీక్షలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏపీఎం శోభ, ఏఎస్సై సతీశ్, గ్రామ పంచాయతీ మాజీ కోఆప్షన్ సభ్యుడు బాల్‌రాజ్ పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో నైపుణ్యాలను పెంచుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలో మైక్రోసాఫ్ట్, హైదరాబాద్ యునైటెడ్ వే ఆధ్వర్యంలో స్కిఫీ సంస్థ ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ 2వ బ్యాచ్ ఉచిత శిక్షణను శనివారం మున్సిపల్ వైర్మన్ కొందూటి నరేందర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మైక్రోసాఫ్ట్, యునైటెడ్ వే సంస్థ నిర్వాహకులను అభినందించారు. - షాద్‌నగర్‌టౌన్, డిసెంబర్ 28

మున్సిపాలిటీగా మొయినాబాద్

- కొత్తగా మూడు గ్రామపంచాయతీల ఏర్పాటు
- అసెంబ్లీలో ప్రకటించిన ప్రభుత్వం

మొయినాబాద్, డిసెంబర్ 28 : హైదరాబాద్ మహా నగరానికి అతి చేరువలో మొయినాబాద్ మండలం ఉండటంతో మొయినాబాద్‌ను మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తున్నట్లుగా ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించింది. మొయినాబాద్‌లో 8 గ్రామాలను కలుపుతూ మున్సిపాలిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నది. అదేవిధంగా కొత్తగా మూడు గ్రామపంచాయతీలను కూడా ఏర్పాటు చేయాలని సంకల్పించింది. మొయినాబాద్‌లో మొత్తం 28 గ్రామపంచాయతీలు, 9 అనుబంధ గ్రామాలున్నాయి. 28 గ్రామపంచాయతీల నుంచి 8 గ్రామపంచాయతీలను కలిపి మున్సిపాలిటిగా ఏర్పాటు చేయాలని యోచిస్తున్నది. అనుబంధ గ్రామాల్లో 3 కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం అధికారుల నుంచి నివేదికలను తెప్పించుకుంటున్నది. అందుకుగాను అధికారులు నివేదికలను తయారుచేయడానికి తీవ్ర కసరత్తు చేస్తున్నారు. రాత్రి, పగలు అనకుండా నివేదికలను తయారుచేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

మున్సిపాలిటీగా ఏర్పడే గ్రామాలు ఇవే..

మొయినాబాద్ మండలంలోని అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, ఎన్కేపల్లి, మొయినాబాద్, సురంగల్, చిలుకూరు, పెద్దమంగళారం, మూర్తుజాగూడ గ్రామాలను కలుపుతూ మునిన్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందాయి. 8 గ్రామాలకు సంబంధించి భౌగోళిక అంశాలకు సంబంధించిన వివరాలు, జనాభా, గ్రామాలకు రెవెన్యూ ఎంత విస్తీర్ణంలో ఉందనే అంశాలను ప్రతిపాదనలో పొందుపర్చి నివేదికను ప్రభుత్వానికి ఇచ్చారు.

ఈ గ్రామాలను కూడా కలుపాలని వినతులు

ఎనిమిది గ్రామాలతో పాటు తమ గ్రామాలను కూడా మున్సిపాలిటీలో కలుపాలని చాలా గ్రామాల నుంచి ప్రతిపాదనలు అధికారులు, ప్రజాప్రతినిధులకు అందాయి. ఇప్పటికే అప్పోజిగూడ గ్రామస్తులు కలెక్టర్‌ను కలిసి గ్రామాన్ని మున్సిపాలిటీలో కలుపాలని వినతి పత్రం అందించారు. అదేవిధంగా అమ్డాపూర్, బాకారం, కాశింబౌలి, నాగిరెడ్డిగూడ గ్రామాలను కూడా మున్సిపాలిటీలో కలుపాలని వినతులు వెల్లువెత్తుతున్నాయి. తమ గ్రామాలు కూడా నగరానికి, ఔటర్ రింగ్ రోడ్డుకు అతి సమీపంలో ఉన్నాయన్నారు. ఈ గ్రామాల నుంచి ప్రజాప్రతినిధులు, విధద పార్టీల నాయకులు, ఆ గ్రామాల్లో భూములున్న వీఐపీలు సైతం ఈ గ్రామాలను కూడా మున్సిపాలిటీలో కలుపాలని కోరుతున్నారు.

మూడు కొత్త గ్రామపంచాయతీలు

తెలంగాణ రాక ముందు మొయినాబాద్‌లో 21 గ్రామపంచాయతీలుండగా ఆరేండ్ల క్రితం సర్కారు ఏడు కొత్త గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసింది. మొయినాబాద్ మండలంలో కొన్ని గ్రామాలను కలిపి మున్సిపాలిటీగా ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో కొత్తగా మరో మూడు గ్రామపంచాయతీలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. కనకమామిడి గ్రామపంచాయతీకి అనుబంధ గ్రామమైన సజ్జన్‌పల్లిని కొత్త గ్రామపంచాయతీగా, కేతిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీకి అనుబంధ గ్రామాలుగా ఉన్న చాకలిగూడ, కంచమోనిగూడ గ్రామాలను కలిపి చాకలిగూడ గ్రామపంచాయతీగా, పెద్దమంగళారం గ్రామపంచాయతీకి అనుబంధంగా ఉన్న చిన్న షాపూర్‌ను గ్రామపంచాయతీకిగా ఏర్పాటు చేయడానికి కసరత్తులో భాగంగా ఆ గ్రామాలకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి నివేదికను తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. కొత్త గ్రామ పంచాయతీలకు సంబంధించి తయారు చేయనున్న నివేదికను త్వరలోనే ప్రభుత్వానికి అందించనున్నారు.

ఎల్కగూడ ఒకే గ్రామపంచాయతీగా..

ఎల్కగూడ గ్రామం గతంలో కొంత భాగం పెద్దమంగళారం గ్రామపంచాయతీ, మరి కొంత భాగం కుతుబుద్దీన్‌గూడ గ్రామపంచాయతీల పరిధిలో ఉండేది. కాని బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసినప్పుడు పెద్దమంగళారం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఎల్కగూడ కొంత భాగాన్ని నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయగా.. కొంత భాగం కుతుబుద్దీన్‌గూడ గ్రామపంచాయతీ పరిధిలోనే ఉండిపోయింది. ఒకే గ్రామం రెండు గ్రామపంచాయతీల పరిధిలో కాకుండా ఒకే గ్రామపంచాయతీ పరిధిలో ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలని గతంలో గ్రామస్తులు ప్రజాప్రతినిధులు, అధికారులకు అనేక వినతులు పెట్టుకున్నారు. కానీ కొన్ని రెవెన్యూ సంబంధమైన అంశాలు, సాంకేతిక అంశాల కారణంగా ఒకే గ్రామపంచాయతీగా ఏర్పాటు కాలేకపోయింది. ఇప్పుడు కుతుబుద్దీన్‌గూడ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న కొంత భాగం ఎల్కగూడను.. ఎల్కగూడ గ్రామపంచాయతీలో విలీనం చేయడానికి అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. దీంతో గ్రామ ప్రజల నుంచి కొంత సంతోషం వ్యక్తం అవుతున్నది. అందుకు సంబంధించిన పూర్తి నివేదికను అధికారులు ప్రభుత్వానికి పంపినట్లుగా అధికార వర్గాలు పేర్కొన్నాయి.

మున్సిపాలిటీలో కలిపే గ్రామాల వివరాలు

గ్రామాలు	జనాభా (2011 ప్రకారం)
మొయినాబాద్	2516
అజీజ్‌నగర్	4767
హిమాయత్‌నగర్	3902
ఎన్కేపల్లి	2395
చిలుకూరు	6100
పెద్దమంగళారం	4590
సురంగల్	1810
మూర్తుజాగూడ	961

కొత్తగా ఏర్పాటయ్యే గ్రామపంచాయతీలు

గ్రామపంచాయతీలు	జనాభా
సజ్జన్‌పల్లి	445
చిన్నషాపూర్	392
చాకలిగూడ (కంచెమోనిగూడ)	553

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



పంచాయతీ కార్మికులకు నిమ్మరసం అందజేస్తున్న సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి తదితరులు

కడ్తాల్, డిసెంబర్ 28 : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని జీపీ వర్కర్స్ యూనియన్ మండలాధ్యక్షుడు కుమార్ అన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ .. గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు పెంచాలన్నారు. ఆరు నుంచి పది నెలల జీతాలు అందక అనేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. కార్మికులకు మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి, జీవో 60 ప్రకారం వేతనాలను అందజేయాలన్నారు. కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనాన్ని రూ.18 వేలు ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సమ్మెకు సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి మద్దతు తెలిపారు. అనంతరం కార్మికులకు నిమ్మరసం అందించి సమ్మె విరమింపజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు నర్సింహ, బీఆర్ఎస్ యువజన విభాగం గ్రామాధ్యక్షుడు కృష్ణ, వివేకానంద యూత్ అధ్యక్షుడు మాధవులు, నాయకులున్నారు.

యువకుడు అదృశ్యం

దీపక్ కుమార్(ఫైల్)

చేవెళ్ల రూరల్, డిసెంబర్ 28 : యువకుడు అదృశ్యమైన ఘటన శంకర్‌పల్లి మండలం మోకిలా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ వీరబాబు కథనం ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన దీపక్ కుమార్(23) మోకిలాలో హెయిర్ కటింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 27న కటింగ్ షాపుకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. చుట్టుపక్కలా, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీపక్ కుమార్ అక్క బిందుకుమారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీతాలు చెల్లించాలంటూ కార్మికుల నిరసన

మాడ్గుల గ్రామపంచాయితీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

మాడ్గుల, డిసెంబర్ 28 : మండల కేంద్రంలోని మాడ్గుల గ్రామపంచాయతీ వద్ద శనివారం మాడ్గుల పారిశుధ్య కార్మికులు జీతాలు చెల్లించాలంటూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కార్మికులు మాట్లాడుతూ.. మూడు నెలల నుంచి జీతాలు రాక చాలా ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. కుటుంబాన్ని పోషించుకోవాలంటే పెద్ద సవాల్‌గా మారిందన్నారు. అప్పులు చేయవలసిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే విధులకు హాజరుకాబోమని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

మంచాల, డిసెంబర్ 28 : మంచాల మండలం ఎల్లమ్మతండా గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. మంచాల సీఐ మధు కథనం ప్రకారం.. ఎల్లమ్మతండా గ్రామానికి చెందిన 10 మంది కూలీలు బతుకుదెరువు కోసం 15 రోజుల క్రితం ఇతర జిల్లాల్లో కట్టెలు కొట్టేందుకు వెళ్లిన వారు తిరిగి శుక్రవారం రాత్రి ఎల్లమ్మతండా గ్రామానికి జీపులో వస్తున్నారు. లోయపల్లి నుంచి రంగాపూర్ వైపు వస్తున్న కారు జీపును ఢీకొట్టడంతో జీపు పల్టీకొట్టింది. జీపులో ఉన్న సపావట్ భాస్కర్, రమావత్ హీరా, సపావట్ లచ్చీరామ్, ఆంగోత్ దస్రూ, సపావట్ బిక్కూ, సపావట్ హీరా, కాంట్రోత్ పాండులకు తలకు, చేతికి, కాళ్లకు గాయాలైనట్లు చెప్పారు. వారు ఇబ్రహీంపట్నం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సీఐ తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న గురునాథ్‌రెడ్డి

మార్కెట్ అభివృద్ధికి ప్రణాళికబద్ధంగా కృషిచేస్తాం

ఇబ్రహీంపట్నంరూరల్, డిసెంబర్ 28 : ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి ప్రణాళికబద్ధంగా కృషి చేయనున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్‌రెడ్డి అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం మొదటి సమావేశాన్ని మార్కెట్ కమిటీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారంతోపాటు నూతన భవన నిర్మాణాలపై, నిర్మాణం పూర్తయిన 17 మడిగెల గురించి చర్చించినట్లు తెలిపారు. ముఖ్యంగా ఇబ్రహీంపట్నం మార్కెట్‌ను మోడల్ మార్కెట్‌గా తీర్చిదిద్దడం కోసం ఎమ్మెల్యే సహకారంతో కృషిచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రవంతి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కరుణాకర్, సహకార సంఘం చైర్మన్ పాండురంగారెడ్డి, డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఎంబీఏ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 28: ఓయూ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (సీబీసీఎస్), ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్-డే), ఎంబీఏ 'టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్) కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్, ఎంబీఏ (ఈవినింగ్) ఐదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును వచ్చే నెల 4వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.300 అపరాధ రుసుముతో వచ్చే నెల 8వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

దైవదర్శనానికి వెళ్లి వచ్చేసరికి ఇల్లు గుల్ల

చేవెళ్ల రూరల్, డిసెంబర్ 28 : దేవుడి దర్శనానికి ఇంటికి తాళం వేసి కుటుంబం మొత్తం వెళ్లి తిరిగి వచ్చి చూడగా ఇంట్లో చోరీ జరిగిన ఘటన శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మున్సిపల్ పరిధి ఫతేపూర్ వార్డులో నివాసముంటున్న కాడిగల్ల శ్రీనివాస్ ఈ నెల 27న యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దైవదర్శనం కోసం కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. శనివారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చి చూడగా బీరువాలో ఉన్న రూ.3 లక్షలు, కిలో వెండి, తులం బంగారం చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహేశ్వరం మండలంలోని తుక్కుగూడ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములుపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని టీఎస్ యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం తెలంగాణ రాష్ట్ర ఐక్యోపాధ్యాయ ఫెడరేషన్ నాయకులు పాఠశాలలో హెచ్ఎంను పరామర్శించారు. - కడ్తాల్, డిసెంబర్ 28

యువతి అదృశ్యం

దర్గ సంధ్య(ఫైల్)

మొయినాబాద్, డిసెంబర్ 28 : ఇంటి నుంచి ఉద్యోగానికి వెళ్తున్నానని చెప్పిన ఓ యువతి తిరిగి ఇంటికి రాకుండా అదృశ్యమైన ఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామానికి చెందిన దర్గ సంధ్య(22) గండిపేట్ చౌరస్తాలోని వీఆర్‌కే మెడికల్ కాలేజ్ అండ్ దవాఖానలో ఉద్యోగం చేస్తున్నది. ఈ నెల 27న మధ్యాహ్నం 2 గంటలకు ఉద్యోగానికి వెళ్లింది. తరువాత తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికి, బంధువులకు కూడా ఫోన్ చేసి తెలుసుకున్నారు. అదేవిధంగా ఉద్యోగం చేస్తున్న కళాశాలకు వెళ్లి తెలుసుకున్నా ఆచూకీ లభించలేదు. దీంతో సంధ్య సోదరుడు సంజీవ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

నేడు ఇబ్రహీంపట్నంలో అనియత విద్యా బోధకుల సమావేశం

మంచాల, డిసెంబర్ 28 : ఇబ్రహీంపట్నం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో అనియత విద్యా పర్యవేక్షకుల సమావేశం ఈ నెల 30న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకింది చక్రపాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు వెళ్లనివారు, వెళ్లి మధ్యలో బడి మానివేసిన వారి కోసం ప్రవేశపెట్టిన అనియత విద్యా పథకంలో నిరక్షరాస్యత నిర్మూలన కోసం 23 సంవత్సరాలుగా పనిచేసిన బోధకులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోడ్డుపాలు చేశాయన్నారు. గతంలో పనిచేసిన అనియత విద్యా బోధకులకు విద్యా వ్యవస్థలో ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి రోజుకో మాటతో ప్రభుత్వాలు దాటవేస్తున్నాయని చెప్పారు. అనియత విద్యా బోధకుల సమస్యల పరిష్కారం కోసం అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నందున ఈ సమావేశానికి ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, హయత్‌నగర్, పరిగి, చేవెళ్ల, మేడ్చల్, వికారాబాద్, తాండూర్‌లకు చెందిన అనియత బోధకులు, సూపర్‌వైజర్లు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

ఆరుట్లలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో

సర్వేను వేగవంతం చేయండి

ఎంపీడీవో బాలశంకర్

మంచాల, డిసెంబర్ 28 : ఇందిరమ్మ ఇండ్ల సర్వేను అధికారులు వేగవంతం చేయాలని మంచాల ఎంపీడీవో బాలశంకర్ అన్నారు. శనివారం మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో అధికారులు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే కార్యక్రమాన్ని ఎంపీడీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో చేపడుతున్న సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన వారందరికీ అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి సహకరిస్తాం

పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్లు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కడ్తాల్, డిసెంబర్ 28 : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తామని లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు సభ్యులు మోహన్‌రెడ్డి, ఓంకార్‌గుప్తా అన్నారు. శనివారం తలకొండపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు క్లబ్ తరపున 10 సీలింగ్ ఫ్యాన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో క్లబ్ సభ్యులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాలని తెలిపారు. పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో క్లబ్ తరపున అందించే సేవా కార్యక్రమాలను మరింత విస్తృతపరుస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ అజీమ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఫేక్ ఫోన్‌పే యాప్‌తో మోసం

చేవెళ్లటౌన్, డిసెంబర్ 28 : ఫేక్ ఫోన్‌పే యాప్‌తో గత కొన్ని నెలలుగా కొంత మంది వ్యక్తులు దుర్గ వైన్స్ షాపులో మద్యం కొనుగోలు చేసి ఫేక్ ఫోన్ పే యాప్ ద్వారా డబ్బులు చెల్లించకుండా చెల్లిస్తున్నట్లు ఆ వైన్స్ మేనేజర్‌ను మోసం చేసిన సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. చేవెళ్ల ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి కథనం ప్రకార.. గత కొన్ని నెలలుగా చేవెళ్లలోని దుర్గ వైన్స్ షాపులో చేవెళ్లకు చెందిన కొందరు వ్యక్తులు మద్యం కొనుగోలు చేసి ఫేక్ ఫోన్‌పే యాప్ ద్వారా డబ్బులు చెల్లించకుండా చెల్లించినట్లు వైన్స్ మేనేజర్‌ను నమ్మించి మోసం చేశారని తెలిపారు. వైన్స్ మేనేజర్ తన అకౌంట్ చెక్ చెయ్యగా నగదు తక్కువ రావడంతో తన షాపులో ఉన్న సీసీ టీవీ కెమెరాలను చెక్ చేశారు. కొంతమంది వ్యక్తులు తరచుగా వైన్స్‌కు వచ్చి ఫేక్ ఫోన్‌పే యాప్ ద్వారా మద్యం కొనుగోలు చెయ్యడం గమనించి వారిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పోలీసులు ఆ వ్యక్తులను విచారించగా నిజము ఒప్పుకొన్నారని ఎస్సై తెలిపారు. వైన్స్ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఫేక్ ఫోన్‌పే యాప్ ద్వారా జరిగే మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

అపోహలు చెందవద్దు

మన్సూరాబాద్, డిసెంబర్ 28: లక్షలాధిగా ఉన్న కార్పొరేట్ అంధులకు చూపును ప్రసాదించడానికి, అవయవలేమి బాధితులకు పునర్జన్మనివ్వడానికి ప్రజలు ముందుకు రావాలని సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు టి.శ్రవణ్‌కుమార్, జీవన్‌దాన్ సంస్థ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.భానుచంద్ర కోరారు.

ఖమ్మం గ్రేస్ సర్వీస్ సొసైటీ సంస్థ సహకారంతో మున్సిపల్ వైర్‌పర్సన్ పండుగల జయశ్రీ శనివారం పెద్దఅంబర్‌పేటలోని శాంతినగర్ కాలనీ, సంతోష్‌నగర్ కాలనీల్లో 150 లెప్రసీ బాధిత కుటుంబాలకు బియ్యం, బ్లాంకెట్లు, చీరెలు, షర్టులు పంపిణీ చేశారు. సొసైటీ ప్రెసిడెంట్ జాకోబ్ సహకారంతో స్లాప్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్ సమక్షంలో నిత్యావసరాలు అందజేశారు. - పెద్దఅంబర్‌పేట, డిసెంబర్ 28

ఫ్యాషన్ టెక్నాలజీ పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 28: ఓయూ పరిధిలోని బ్యాచ్‌లర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు సెమిస్టర్ మెయి